క్లుప్తంగా

స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలు

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో గురువారం జాతీయ స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ జావిద్ అన్వర్ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిత, పంచాయతీ కార్యదర్శి అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపార్చన

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గురువారం దీపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంత చతుర్ధశిని పురస్కరించుకొని, మహిళలు ఆలయ ప్రాంగణంలో వత్తులు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం అధ్యక్షుడిగా సంతోష్

బోథ్: మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షుడిగా బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన కడధారపు సంతోష్ నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు భైరీ నరేశ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. గ్రామాల్లో మూఢనమ్మకాలను నిర్మూలించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

భూమిపూజ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో గ్రంథాలయం భవన నిర్మాణానికి సర్పంచ్ సదానంద్ గురువారం భూమిపూజ చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్, మార్కెట్ డైరెక్టర్ కొడాల మహేందర్, నాయకులు గంద్రత్ అశోక్, నారాయణ, అరుణ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని డోంగర్‌గాం గ్రామానికి చెందిన మడావి దేవ్‌రావ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భోజ్జుపటేల్ బాధిత కుటుంబసభ్యులను గురువారం పరామర్శించారు. సయ్యద్ కరీం, మడావి సురేశ్, పెందోర్ సురేందర్ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు

బోథ్: మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీ పాత జిన్నింగ్ ఫ్యాక్టరీ నుంచి రైతులు చేనులోకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎంపీటీసీ రజియా బేగం తన సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న మండల కేంద్రానికి చెందిన కిరణ్ కుమార్ రోడ్డు ప్రమాదంతో ఇటీవల మరణించాడు. కాగా గురువారం బోథ్ మండల కేంద్రంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ కిరణ్ భౌతికాయానికి నివాళులర్పించారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: జిల్లాలో ఎరువుల కొరత సృష్టిస్తూ ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తిరుపతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తే తప్పా తనిఖీలు చేపట్టడం లేదన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. స్వామినాథన్ వ్యవసాయరంగానికి, పంటలసాగు ఉత్పత్తి పెంచడంలో అనేక పరిశీలనలు చేశారని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన కృషికి భారతరత్న, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి అవార్డులు అందుకున్నారని అన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి సమస్యలను విన్నవించారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం కేసీఆర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సలీం, మీడియా కార్యదర్శి దేవదర్శన్, అధ్యక్షుడు రాజేశ్వర్, రమేశ్, సంపత్ మంగేష్ పాల్గొన్నారు.

వెళ్లిరా.. గణపయ్య



నృత్యం చేస్తున్న యువకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంలో గణపతి నిమజ్జనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని వినాయక్ చౌక్ వద్ద విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిమజ్జన శోభాయాత్రకు జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎంపీపీ జైవంత్‌రావు, ఆర్డీవో దికార్‌రెడ్డి, డీఎస్పీ నాగేందర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు భారతమాత, గణేష్ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య గణనాథులను నిమజ్జనానికి తరలించారు. లక్కారం పరిధిలోని గంగన్నపేట చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో గురువారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలను ప్రధాన విధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, పిల్లలు సాంప్రదాయ నృత్యాలు చేశారు.



ఉట్నూర్‌రూరల్: శోభాయాత్రను తిలకించేందుకు వచ్చిన ప్రజలు



ఉట్నూర్‌రూరల్: పూజలు చేస్తున్న భక్తులు

అన్నదాన కార్యక్రమాలు



అన్నదానంలో పాల్గొన్న జెడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్: మండల కేంద్రంలోని విద్యార్థి, మిత్ర, మైసమ్మ గణేష్ మండపాలలో గురువారం అన్నదాన కార్యక్రమాలరు నిర్వహించారు. విద్యార్థి గణేష్ మండపం వద్ద జెడ్పీటీసీ సంధ్యారాణి పాల్గొన్నారు.



నిమజ్జనానికి క్యూ కట్టిన గణనాథులు



ఇచ్చోడ: నృత్యం చేస్తున్న భక్తులు

ఇల్లు నిర్మించి.. అండగా నిలిచి

- పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తున్న మున్నూరుకాపులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు

ఆదిలాబాద్‌రూరల్: వ్యవసాయ పనులు, ఇతర కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న మున్నూరు కాపు పేదలకు ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు అండగా నిలుస్తున్నారు. సొంత ఇంటి స్థలం ఉండి పూరి గుడిసెలో నివాసం ఉంటూ.. ఇల్లు నిర్మించుకోలేని వారికి ఇంటి నిర్మాణం చేయించి వారి సొంతింటి కలను నెరవేరుస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ రూరల్ మండలంలో పలువురికి ఇళ్లు నిర్మించి ఇచ్చారు.

ఏడు ఇళ్ల నిర్మాణం పూర్తి..

మున్నూరుకాపు సామాజికవర్గంలో అత్యంత పేదరికంలో ఉన్న వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు మున్నూరుకాపు కులస్తులు ముందుకు వచ్చారు. మాజీ జెడ్పీటీసీ, మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన సామాజిక కార్యకర్త కొండ గంగాధర్ పర్యవేక్షణలో ఇళ్లను నిర్మించి ఇస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో ఆరు, అర్లి (బి) గ్రామంలో ఒకరికి రూ. లక్షతో ఇంటిని నిర్మించి ఇచ్చారు. కచికంటి, అంకోలి గ్రామాలలోని పలువురికి ఇళ్లు లేదని గుర్తించి, వారికి సైతం ఇల్లు నిర్మించి ఇవ్వనున్నారు.

ఉద్యోగులు, వ్యాపారుల చేయూత

ప్రభుత్వం ప్రతిఒక్కరికీ ఇంటి నిర్మాణం చేయించలేదని మున్నూరుకాపు కులస్తులు వారి కులంలోని పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు వారికి తోచినంత ఆర్థిక చేయూత అందిస్తున్నారు. పేదలకు అండగా నిలువడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మున్నూరుకాపు కులస్తులు నిర్మిస్తున్న ఇల్లు

దాతలు సహకరించాలి



మున్నూరుకాపు సామాజికవర్గంలో పేదరికంలో ఉండి ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని గత ఏడాది నిర్ణయించుకున్నాం. గ్రామాల్లో సర్వేలు చేసి అలాంటి వారిని ఎంపిక చేశాం. ఇప్పటికే ఆదిలాబాద్ రూరల్ మండలంలో ఏడు ఇళ్లను నిర్మించి ఇచ్చాం.

– కొండ గంగాధర్, మున్నూరుకాపు సామాజిక కార్యకర్త

అండగా నిలిచినందుకు ధన్యవాదాలు



నేను ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇంటి నిర్మాణం చేసేందుకు తమ సామాజికవర్గానికి చెందిన వారు ముందుకు వచ్చి ఇంటిని నిర్మించడం పట్ల వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. వారికి జీవితంతం రుణపడి ఉంటాను.

– కల్యాణం రమేశ్, యాపల్‌గూడ

వైద్య శిబిరం

గుడిహత్నూర్: మండలంలోని తెలంగ్‌రావ్‌గూడలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. యునాని వైద్యులు సాదియా, ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వైశాలి, ఏఎన్‌ఎం సులోచన, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్



మాట్లాడుతున్న రాంకిషన్ నాయక్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రాంకిషన్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటి పథకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే జరిగే అభివృద్ధి పనులను వివరించారు. ఆయన వెంట నాయకులు మధన్‌రావు, గణేశ్‌సింగ్, జమీర్, తాజొద్దీన్, సికిందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

బోథ్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాది పంద్రం శంకర్ అన్నారు. గురువారం మండలంలోని ఘన్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలను తెలుసుకున్నప్పుడే హక్కులపై పోరాడగలమన్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు.

ఈరోజు..

ఇచ్చోడలో వినాయక నిమజ్జనం

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే వినాయక నిమజ్జనానికి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఇచ్చోడ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జామ మసీద్ వద్ద ప్రత్యేక భారీకెడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఎల్లమ్మ కుంట వద్ద ప్రత్యేక లైట్లు, క్రేన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అనిల్‌జాదవ్ రాక

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రానికి వస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఇచ్చోడ మండల కేంద్రంలో జరగనున్న వినాయక నిమజ్జన పాల్గొని పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తకార్యకర్తలు తరలిరావాలని కోరారు.

మంచు దుప్పటి..



తాంసి మండల వ్యాప్తంగా గురువారం పొగమంచు కప్పేసింది. మండలంలోని పాలోది గ్రామ శివారులోని పంటచేలను, గుట్టలను సైతం పొగమంచు కప్పేయడంతో అదృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. - తాంసి

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఎదులాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 18 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, నాలం రాధ, కరాడ్ ఛాయ, వజ్రమాల, కరాడ్ ఇందుమతి, స్వప్న, సురేఖ, స్వప్న, సంగీత, హేమలత పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: టెట్‌తో సంబంధం లేకుండా గిరిజన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణ కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వందలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే సీఎం కేసీఆర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రవి జాదవ్, సురేశ్ జాదవ్, నేమాజీ, కైలాస్, సలాం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్'

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆరోపించారు. గురువారం భగత్‌సింగ్ 116వ జయంతిని బీజేపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఇచ్చిన హామీ నేటివరకు నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సుహాసినిరెడ్డి

ఆశవర్కర్ల వినూత్న నిరసన



చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు కాంతాబాయి డిమాండ్ చేశారు. గురువారం నాలుగో రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఆశవర్కర్లు చెవిలో పువ్వు పెట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు హెల్త్‌కార్డులు, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కనక తుల్సీబాయి, సులోచన, వనమాల, సుమిత్ర, ఊర్మిళ, రుషాలి, సువర్ణ, సునీత, గోదావరి, సోను పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై రైతుల ఆసక్తి



డ్రోన్ ద్వారా పిచికారీ చేయిస్తున్న రైతు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఇంద్రాయి మహిళ సమాఖ్య(ఐకేపీ) కార్యాలయంలో రాయితీపై తీసుకువచ్చిన డ్రోన్ పిచికారీ యంత్రంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరానికి రూ. 500 మాత్రమే ఉండడంతో పాటు సమయం ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని ఏమాయికుంట, గాలియబాయితండా గ్రామాల్లో పలువురి రైతులు డ్రోన్ యంత్రంతో పురుగు మందును పిచికారీ చేయించారు. ఏ పంటకు అయినా.. డ్రోన్ ద్వారా పిచికారీ చేయవచ్చని ఆపరేటర్ జాడి మల్లేష్ తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ పంటకు పిచికారీ చేయవచ్చన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ఎదులాపురం: భగత్‌సింగ్ నవతరానికి స్ఫూర్తి ప్రదాత అని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ అన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతి జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ చౌక్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్రాజ్యవాద దోపిడీ పాలనపై తిరుగుబాటు చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కనకే దత్తు, అరీఫ్, రోషన్, సురేశ్, గోపి, గోపాల్, నాగరాజ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 116వ జయంతిని మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో గురువారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు పవన్ కల్యాణ్, లక్ష్మణ్, సాబ్లే సంతోష్ సింగ్, చంద్రశేఖర్, రాకేశ్, అరవింద్, మణికాంత్, అనిల్, బంటి, గణేష్, శివ, ఆనంద్, సిద్ధార్థ్, సునీల్, భగత్‌సింగ్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బోథ్: నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

ఆశయ సాధనకు కృషి చేయాలి

తాంసి: యువత భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని కప్పర్ల సర్పంచ్ సదానంద్ అన్నారు. గురువారం కప్పర్ల పంచాయతీ కార్యాలయం వద్ద యువకులతో కలిసి భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, ఉప సర్పంచ్ రాజు, రాకేశ్, వెంకట్రావు, స్వామి పాల్గొన్నారు.

బోథ్: భగత్‌సింగ్ జయంతిని మండల వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో భగత్‌సింగ్ విగ్రహానికి కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశభక్తికి ప్రతీకగా భగత్‌సింగ్ నిలిచారని కొనియాడారు. కార్యక్రమలంలో అల్లకొండ పోతన్న, నవీన్, వడ్లకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



ఎదులాపురం: నినాదాలు చేస్తున్న నాయకులు

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్త సుజాత అన్నారు. పోషణ పక్షోత్సవంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సుజాత